

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## పసిడి రెక్కలు విసిరి కాలం...

**జేబులోంచి** ఇంటి తాళం తీస్తూ చంద్రమౌళి చేతి గడియారం వంక చూసాడు. ఏడున్నర.

అతని గుండె ఝల్లుమంది. జగతితో యుద్ధం తప్పదు అనుకున్నాడు. లోపలకి వెళ్ళగానే మొదలుపెడుతుంది. 'మీకేం పొద్దున వెళ్ళి రాత్రికి వస్తారు. నేనొక్కదాన్నే తోచక తన్నుకుంటున్నాను. ఆఫీస్ అవగానే ఇంటికి రాకుండా పెత్తనాలేంటి...' ఆ ఝంఝూమారుతాన్ని తట్టుకోవడం కష్టం.

నెమ్మదిగా తలుపు మూసి లోపల బోల్ట్ పెట్టాడు. జగతి అతన్ని చూడగానే టివిని మ్యూట్‌లో పెట్టి, లేచి వెళ్ళి మంచినీళ్ళ గ్లాస్‌తో వచ్చింది.

నీళ్ళు తాగుతూ ఉపన్యాసం వినడానికి మానసికంగా సంసిద్ధంగా ఉన్న చంద్రమౌళి. భార్య మౌనానికి ఆశ్చర్యపోయాడు.

"మొదలుపెట్టు." అన్నాడు గ్లాస్ అందిస్తూ.

ఆమె మాట్లాడలేదు.

"తుఫాన్ ముందటి ప్రశాంతిలాగా ఏంటి జగం? తిట్టెయ్. టెన్షన్ తట్టుకోలేకపోతున్నా" అర్థించాడు.

"తిట్టడం ఎందుకు? ఒక్కోసారి లేటవుతూంటుంది. బయటకి వెళ్ళాక చెప్పిన టైముకే రావాలంటే కష్టం. పైగా ట్రాఫిక్" చెప్పి జగతి అన్‌మ్యూట్ చేసి టి.వి చూడసాగింది.

చంద్రమౌళి ఆ మాటలకి నిర్ఘాంతపోయి భార్య పక్కన కూర్చుని ఆమె చెయ్యి పట్టుకుని అడిగాడు.

"ఈ జ్ఞానోదయం ఎప్పుడైంది జగ్గమ్మ? ఏదీ చేతికి తావీజు కూడా లేదా?"

జగతి అతనివైపు తిరిగి అతని భుజాన్ని రెండు చేతులతో పట్టుకుని, తలానించి చెప్పింది.

"ఇవాళ శాస్త్రులుగారింటికి వెళ్ళొచ్చాను" అతనికి ఆమె కన్నీరు వెచ్చగా తగిలింది.

"ఏమైంది? మనవాడు పెళ్ళిచేసుకోకుండా సన్యాసుల్లో కలుస్తాడని చెప్పాడా ఏంటి? అసలు ఈ శాస్త్రాలలో సైంటిఫిక్ రీజనింగ్ ఉండదు వెళ్ళద్దు అంటే వినవు. వాడికి ఎప్పుడు పెళ్ళి చేసుకోవాలనిపిస్తే అప్పుడు చేసుకుంటాడు. వర్రీ అవకు" ఓదార్చాడు.

జగతి ముక్కు ఎగబీల్చింది.

"నా తల్లి కదూ. జగ్గూ భాయ్. నువ్వు నన్ను అరవాలి, తిట్టాలి. అంతేకాని ఈ కన్నీళ్ళేమిటి?" చంద్రమౌళి కంగారుపడ్డాడు.

"ఏం లేదు. స్నానం చేసి రండి. ఈలోగా చపాతీలు కాలుస్తా."

జగతి సోఫాలోంచి లేచింది. చంద్రమౌళి ఆమెని కూర్చోపెట్టి చెప్పాడు.

"నీ బాధేమిటో చెప్పేదాకా ఆకలి లేదు. తిండీలేదు. ఏమైందో చెప్పు. వస్తూంటే దారిలో ఎవడైనా గొలుసు కొట్టేసాడా? లేక పర్స్ కొట్టేసాడా? శాస్త్రులుగారు ఏమైనా అన్నారా? మీ అమ్మ గుర్తొచ్చిందా? చెప్పు తల్లీ.

జగతి భర్త ఒళ్ళో తలపెట్టుకుని కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. తర్వాత చెప్పసాగింది.

"శాస్త్రులుగారి దగ్గరకి వెళ్ళి, మనవాడు పెళ్ళి అంటే కరుస్తున్నాడని, ఇంకోసారి పెళ్ళి ప్రసక్తి తెస్తే ఇంక ఫోన్ కూడా చేయనని అరిచాడని ఆయనకి చెప్పి వాడి జాతకం ఇచ్చాను. ఆయన నన్ను ఓ గంట వెయిట్ చేయమని, రెండు గంటల తర్వాత లోపలకి పిలిచారు" ఆమె ఆగిపోయింది.

"ఏం చెప్పారు?" చంద్రమౌళి ఆత్రంగా అడిగాడు.

"వాడికి కేతుదశో, కుజదశో ఏదో దశ నడుస్తోందిట. పెళ్ళి సంగతి పక్కన పెట్టండి. వాడి జాతకం ప్రకారం వాడికి స్మశాన దర్శన యోగం ఉంది. అంటే తల్లితండ్రుల్లో ఒకరు పోతారు. జాగ్రత్తగా ఉండండి" అని చెప్పారు. ఆమె గద్గదస్వరంతో చెప్పింది.

"ఛ!" చంద్రమౌళి అప్రయత్నంగా చెప్పాడు.

"అది వినగానే నాకు భయమేసింది.. జాతకంలో పోతామని ఉన్నాక ఇంక జాగ్రత్తలేం తీసుకుంటాం? ఐనా జాగ్రత్తగా ఉండక, బస్సుకో, రైలుకో ఎదురు వెళ్ళంగా.. వచ్చే ఉగాదిలోపల పోతామట. ఇంకా ఎనిమిది నెలలు" జగతి నిట్టూర్చింది.

"వీటికి శాస్త్రీయ ఆధారాలు లేవని చెప్పానా? అసలు మనవాడు పుట్టిన టైంకి ప్రపంచంలో వేలాది మంది పుట్టుంటారు. వాళ్ళందరి పేరెంట్స్ మన ఉగాదిలోగా పోతారా? వాళ్ళకి, ఉగాదికి సంబంధం ఏమిటి? పోనీ జనవరి ఫస్ట్‌లోగా పోతారా? పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా పూర్వంలా సూర్యకాంతంలా చిటపటమను జగ్గమ్మ." చంద్రమౌళి చెప్పాడు.

జగతి నవ్వింది. అంతలోనే ఆమె మొహంలో విషాద ఛాయలు కనిపించాయి.

"అలా దెబ్బలాడుకుని సగం జీవితం నాశనం చేసుకున్నాం" నెమ్మదిగా చెప్పింది. చంద్రమౌళి మాట్లాడలేదు.

"వెళ్ళి స్నానం చేసి రండి" జగతి లేచి వంటగదిలోకి వెళ్ళింది.

ఆ రాత్రి భర్తమీద చెయ్యి వేసి, దగ్గరగా పడుకుని చెప్పింది.

"మీకు అరవై రెండు. నాకు ఏభై ఎనిమిది. చిన్న వయసే, పోయే ఏజ్ కాదు."

"నువ్వింకా అది మర్చిపోలేదా బంగారం? నిద్రపో. తెల్లారి లేచేసరికి నాకు నీ అరుపులు వినపడాలి. 'ఏం మనిషి? ఎంతసేపటి నుంచి లేపుతున్నా లేవరు. లేచాక కాలేజ్‌కి లేటవుతుందని' శివాలు..."

జగతి భర్త నోరు మూసింది. చేత్తోకాదు.

ఉదయం వివిధభారతిలో పాత పాటలు వినిపిస్తూండగా నిద్రలేచాడు చంద్రమౌళి. నేపథ్యంలో జగతి సాధింపు మాత్రం వినపడలేదు.

లేచి ముఖం కడుక్కుని బయటకి వచ్చి హడావిడిగా వంటచేస్తున్న భార్యని అడిగాడు.

"జగం. కాఫీ.. నీ సుప్రభాతం లేకుండా నిద్రలేస్తే అస్సలేమీ బాలేదు సుమా."

ఆమె మౌనంగా కాఫీ కప్ అందించింది.

"ఈ వైరాగ్యం ఎన్ని రోజులో చూద్దాం" కాఫీతో బయటకి నడిచాడు చంద్రమౌళి.

"ఏమండీ. మీరు కాలేజ్ మానేయచ్చుగా?"

చంద్రమౌళి గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యాడు. నెలరోజులు ఇంట్లో ఖాళీగా ఉండడంతో తోచక పిచ్చెక్కినట్లయి, ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో హెచ్.ఓ.డి.గా చేరాడు.

అప్పుడూ జగతి గొడవ చేసింది.

"మీకు వచ్చే పెన్షన్‌తో సగంకూడా మనకి ఖర్చుకాదు. అబ్బాయ్ ఎటూ అమెరికాలో ఉన్నాడు. ఇంట్లో పొద్దుట్నించీ సాయంత్రందాకా ఒక్కదాన్నే. మీరు తోడు ఉండచ్చుగా? తోచక తన్నుకుంటున్నాను."

"డబ్బు కోసం కాదు జగ్గమ్మా.." తోచడంలేదు అనబోయి ఆగిపోయాడు.

ఊరికి దూరంగా ఉన్న ప్రైవేట్ కాలేజ్ కాబట్టి ఉదయం వెళ్తే, సాయంత్రం ఆరున్నర అవుతోంది చంద్రమౌళి వచ్చేసరికి. ట్రాఫిక్ జామ్స్ వల్ల ఒక్కోసారి మరో  గంట అదనంగా అవుతోంది. ప్రతీరోజు జగతి ఆ విషయం మీద సణుగుతూనే ఉంది. ఈ రోజూ అలాగే అంటోంది అనుకున్నాడు.

ఇడ్లీ తింటున్న చంద్రమౌళి తలెత్తి భార్య మొహం చూసి నిర్ఘాంతపోయాడు. ఆమె కళ్ళు ఎర్రగా నిద్రలేనట్లుగా ఉన్నాయి. వాటినిండా నీళ్ళు.

"జగతీ ఏమిటిది? నువ్వింకా అది మర్చిపోలేదా?" ఆందోళనగా అడిగాడు.

ఆమె మాట్లాడలేదు.

"ఇప్పుడు అర్థాంతరంగా మానేస్తే  ఎలా చెప్పు? పిల్లలు అన్యాయమైపోరు?

ఈ సెమిస్టర్ అవగానే మానేస్తాను. ప్రామిస్. అప్పుడు ఇద్దరం ఊటీ, సిమ్లా హనీమూన్ వెళ్దాం." నవ్వేసాడు.

"ఉన్న కొద్దికాలమైనా కలిసివుండాలిగా?" జగతి నెమ్మదిగా చెప్పింది.

"కొద్దికాలం ఏం ఖర్మ? తొంభై ఏళ్ళదాకా హేపీగా ఉంటాం. నువ్వు కొత్త కొత్త కారణాలతో నన్ను సాధిస్తూనే ఉంటావు. వర్రీ అవకు"

ఆరోజు త్వరగానే ఇల్లు చేరాడు. ఇల్లంతా ప్రశాంతంగా ఉంది. పెళ్ళయిన కొత్తల్లో తాము వెలిగించుకునే ధూప్ స్టిక్ వాసన వేస్తోంది.

"ఈ అలవాటు ఎప్పుడు మానేసామో?" అనుకున్నాడు.

జగతి తనకి నచ్చని ముదురు రంగుకాక లేత రంగు చీర కట్టుకుని కళకళలాడుతోంది.

"వచ్చారా? రండి. ఈరోజు మనకి మూవీనైట్. రేపు శనివారమే. కాలేజ్ లేదు" భర్తని చూసి నవ్వుతూ ఆహ్వానించింది.

మూవీ నైట్. ఇదికూడా తమ పెళ్లయిన కొత్తల్లో వినోదమే. ప్రతీ శుక్ర, శనివారాలు. శుక్రవారం సినిమా హాల్‌కి సెకండ్ షోకి వెళ్ళేవారు. టి.వి వచ్చిన కొత్తలు.  శనివారం స్టార్ టివిలో వచ్చే సినిమాలు చూసేవారు. జగతి తన ఒళ్ళో తలపెట్టుకుని పడుకుని చూసేది. పెద్ద డైలాగ్స్ వచ్చినప్పుడు ఇంగ్లీష్  అర్థంకాక అడుగుతూండేది. 'వాడేమంటున్నాడు?' క్లైమాక్స్ నాటికి నిద్రపోయేది. తను నడిపించుకెళ్ళి పడుకోపెట్టేవాడు. తెల్లారి పొద్దున అడిగేది.

'ఇంతకీ ఏమైంది? ఆ అమ్మాయి వాడు మోసగాడని తెలుసుకుందా? పాపం వాళ్ళబ్బాయి దొరికాడా?'

ఆ మధుర రాత్రులు గుర్తొచ్చి చంద్రమౌళి పెదవుల మీద చిరునవ్వు చిందులాడింది.

అతను స్నానం చేసి వచ్చేసరికి జగతి సెంటర్ టేబుల్ మీద హాట్ పేక్స్, ప్లేట్స్, మంచినీళ్ళూ సర్దింది.

"ఇవాళ బిర్యానీ వండాను. పులిహోరకూడా" చెప్పింది.

"సూపర్.. ఏం సినిమా చూద్దాం?" వడ్డించుకుంటూ అడిగాడు.

"మీ ఇష్టం. నేను పొద్దున తొమ్మిదింటినించి సాయంత్రం ఏడుదాకా అన్ని చూస్తునే ఉంటా" చెప్పింది.

"ఇదివరకటిలా ఇవాళ తెలుగు, రేపు ఇంగ్లీష్. సరేనా?" చంద్రమౌళి ఉత్సాహంగా అడిగాడు.

"సరే. కాకపోతే కొత్త తెలుగు సినిమాలన్నీ చూసేసాను" జగతి చెప్పింది.

"పోనీ కన్యాశుల్కం చూద్దామా?"

"అంత పాత సినిమానా? ఆ గ్రాంధిక భాష అర్ధమౌతుందో లేదో?" జగతి అనుమానంగా అడిగింది.

"మన జనరేషన్ వరకు అర్ధమౌతుంది."

జగతి లేచి ట్యూబ్‌లైట్ ఆపి బ్లూకలర్ నైట్ బల్బ్ వెలిగించింది. ఇద్దరూ తింటూ నవ్వుకుంటూ కన్యాశుల్కం సినిమా చూసారు.

"ఇంత హాస్య సినిమా అనుకోలేదు" జగతి భర్తకి మజ్జిగ గ్లాస్ అందిస్తూ చెప్పింది.

"రేపు కూడా ఇలాంటి క్లాసిక్ చూద్దాం" చంద్రమౌళి చెప్పాడు.

"ఆనవాయితీ తప్పకూడదబ్బాయ్. రేపు ఇంగ్లీష్ మూవీ."

"నువ్వు నన్ను అబ్బాయ్ అని ఎన్నిరోజులైంది జగం? కాదు ఎన్నేళ్ళయింది?" చంద్రమౌళి సంభ్రమంగా అడిగాడు.

"అనాలోచితంగా వచ్చేసింది. అరవైఏళ్ళబ్బాయ్" జగతి నవ్వేసింది.

ఆ రాత్రి పడుకున్నాక అడిగాడు చంద్రమౌళి.

"ఆరోజులు ఏమైపోయాయి? పెళ్లయిన కొత్తల్లో ఎంత ఉత్సాహంగా కలిసి మెలిసి ఉండేవాళ్ళం? నువ్వెక్కడుంటే, నేనూ అక్కడే ఉండేవాడిని. మన కబుర్లకి అంతుండేదికాదు. సినిమాలు, షికార్లు.. మనకి ఆర్ధిక బాధలు లేవు. అనారోగ్యాలు, మంచంలో తీసుకునే పెద్దవాళ్ళు లేరు. ఉన్న ఒక్క కొడుకు బుద్దిమంతుడు. ఐనా మనమెందుకు ఇంత మెటీరియలిస్టిక్‌గా మరిపోయాం? వయసు పెరిగి శారీరక వాంఛలు తగ్గి ఉండచ్చు. కానీ మన మానసిక బంధం కూడా ఎందుకంత బలహీనమైపోయింది?"

"నిన్న నేనూ అదే ఆలోచించాను. వయసు పెరిగే కొద్దీ నేను గయ్యాళినైపోయాను. ప్రతీదానికి మిమ్మల్ని సాధిస్తూనే ఉన్నాను. మీది దులుపుకుపోయే మనస్థత్వం కాబట్టి పెద్ద గొడవలు కాలేదు అంతే.."

జగతి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. మూసిన కనురెప్పల్లోంచి నీళ్ళు చెవులమీదకి కారుతున్నాయి.

"రాత్రి మీరు నిద్రపోయారు. నాకు నిద్రపట్టలేదు. ఈ మధ్య మనిద్దరం మంచానికి అటొకరు, ఇటొకరం పడుకుంటున్నాం. కొన్ని రోజుల తర్వాత ఇంత పెద్ద మంచం మీద ఒక్కళ్లమే పడుకుంటాం. మీరో. నేనో. శాస్త్రులుగారు ఉగాదిలోపల ఇద్దరిలో ఒకరు పోతారు అన్నారు. అది తప్పవచ్చు. కాని ఎప్పుడైనా, ఏ ఏక్సిడెంటో ఐతే తప్ప ఒకళ్ళు పోయి

మరొకరం వంటరిగా మిగిలిపోతాం. మనం ఏ స్మృతులు మిగుల్చుకుంటున్నాం? భార్యాభర్తలం కాబట్టి కలిసుంటున్నాం. యాంత్రికంగా జీవిస్తున్నాం. ఏమో మనకున్న ఈ స్వల్పకాలాన్ని మనమెందుకు ఫలవంతం చేసుకోకూడదు అనిపించింది. ఏదో ఓ కూర వండే బదులు మీకిష్టమైనది చేస్తే మీరు సంతోషిస్తారు. మీ కిష్టమైనట్లు డ్రెస్ చేసుకోవడం, మీతో కబుర్లు చెప్పడం, ఇద్దరం చెరో టి.వి కాక ఒకటే టి.వి చూడటం ఎందుకు చేయకూడదు? అరవై దాటాక ప్రతీరోజూ బోనస్సే. వందరూపాయల్లో అరవై రూపాయలు ఖర్చయ్యాక మిగిలిన నలభై రూపాయల్ని ఎంత జాగ్రత్తగా పొదుపుగా ఖర్చుపెట్టుకుంటాం? ఇదీ అంతే. ఆ తర్వాత ‘అరె! ఇలా చేసుండాల్సింది. అలా అనుకుండా ఉండాల్సింది’ అని పశ్చాత్తాప పడకూడదు అనుకున్నాను. ఈ వయసులో నేను ఇరవై ఏళ్ళమ్మాయిగా మారలేను. మానసికంగా ఆ మార్పు చాలాకష్టం. కాని మీ సోల్‌మేట్‌గా, భార్యగా ఉండచ్చుగా?"

చంద్రమౌళి భార్యవైపు తిరిగి ఆమె కన్నీళ్ళు తుడుస్తూ చెప్పాడు.

"అవును. ఎంత యాంత్రికంగా మారిపోయాం? నీకు చదివే అలవాటు లేదని నేను చదివిన కథలు, నవలలు చెప్పేవాడిని. కవిత్వాలు చదివి వినిపించేవాడిని. నువ్వూ వాటిని ఎంజాయ్ చేసేదానివి. బాబు పుట్టాక అనుకుంటా ఈ అలవాటు పోయింది. నువ్వెలాగైనా నాకంటే ఎమోషనల్. మన మధ్య వాడు కూడా ఉండకూడదు అని పుట్టినప్పటినించి వాడిని క్రిబ్‌లో పడుకోపెట్టేదానివి. తర్వాత వేరే గదిలో. అలాంటిది నువ్వన్నట్లు మనం చెరోవైపు పడుకుంటున్నాం. మన మధ్య సంభాషణలు తగ్గిపోయాయి. 'బాబు ఫోన్ చేసాడా? విశేషాలేంటిట?' రోజూ ఇదే అడుగుతాను. నువ్వేదో చెప్తావు. వింటాను. అంతే. ఆ తర్వాత మన గురించిన కబుర్లు లేవు. పొడి పొడి మాటలు తప్ప. యవ్వన ఉద్రేకాలు లేకపోయినా ఈ మలివయసులో కూడా మనం ఎందుకు ఉత్సాహంగా ఉండకూడదు? పొద్దున ఊటీ, సిమ్లాలు వెళ్దాం అని ఎగతాళిగా అన్నాను. ఏం ఎందుకు వెళ్లకూడదు? ఈ సెమిస్టర్ హాలిడేస్‌లో వెళ్దాం. మనిద్దరం రెండు ధృవాలైపోయాం. నీ సొసైటీ, నీది, నా సొసైటీ నాది. ఇద్దరం కలిసి వెళ్తే, వెళ్ళేప్పుడు, వచ్చేప్పుడు కారులో ఆర్గ్యుమెంట్స్."

"ఏంటో ఒకళ్ల ఉనికిని ఇంకొకళ్లం సహించలేకపోతున్నాం. ఈ మధ్య మరీ విమర్శలు తప్పించి మన మధ్య ప్రశంసలు లేకుండా పోయాయి. ముప్పై ఏళ్ళనాటి ప్రేమ అకారణంగా మాయమై పోతోంది" జగతి ఆలోచనగా చెప్పింది.

"పెళ్ళయిన కొత్తల్లో మనం బోలెడు పేర్లతో పిలుచుకునేవాళ్ళం. నిన్ను జతి అనేవాడ్ని. ప్రేమ ఎక్కువైతే జతీ నువ్వే నా గతి అనేవాడిని. బాబు పుట్టాక నువ్వు అమ్మయిపోయావు. జగ్గమ్మ అనడం మొదలు పెట్టాను. మరీ ప్రేమ ఎక్కువైతే జగ్గూ భాయ్ అనేవాడ్ని. ఇప్పుడు వెటకారంగా జగం అంటున్నా. నువ్వో? ప్రేమగా చాంద్ అనేదానివి. కోపం వస్తే సుబ్బారావ్ అనేదానివి. సరసంగా అబ్బాయ్ అని పిలిచేదానివి. ఇప్పుడు? ఏమండి."

"అప్పట్లో ‘మో’ అని కూడా పిలిచేదాన్ని" జగతి చిరు సిగ్గుతో చెప్పింది.

"అవునవును. మరెందుకు ఇప్పుడు పిలవడం లేదు జగ్గమ్మా?"

"అదే జగ్గమ్మా అంటున్నారని చంద్రన్నా" జగతి నవ్వింది.

చంద్రమౌళి కూడా నవ్వుతూ అడిగాడు.

"జగతీ నిద్రపట్టడంలేదు. నువ్వు తెలుగు సినిమాలన్నీ చూస్తున్నావని చెప్పావుగ. ఓ కథ చెపుదూ." నువ్వు భలే వినసొంపుగా చెప్తావు."

"మొన్న ఓ మళయాళం డబ్బింగ్ మూవీ చూసాను. చెప్తా రండి."

చంద్రమౌళి ఆమె గుండెలమీద తలానిస్తే, జగతి అతని జుట్టు  చెంపలు నిమురుతూ కథ మొదలు పెట్టింది.

"మోహన్‌లాల్ కొడుకు పృధ్వీరాజ్..."

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments